

వామ్మో రక్తపింజరలు
బెల్లంపల్లి మున్సిపాలిటీలో విషసర్పాల సంచారం పెరిగింది. నాగుపాము, కొండ చిలువలతోపాటు రక్తపింజర పాములు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. 8లో▸



కలుపు కలవరం..!
విస్తారమైన వర్షాలతో పత్తి చేలల్లో విపరీతమైన కలుపు పెరిగింది. కలుపుతీతతో ఆర్థిక భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.7 /25.5
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆసిఫాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా అప్పారావు

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.అప్పారావు నియమితులయ్యారు. సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న అప్పారావును జిల్లాకు బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ జ్యోతి బుద్దా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సబ్ రిజిస్ట్రార్ దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో జూనియర్ అసిస్టెంట్ అశోక్ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం నుంచి ఎట్టకేలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కార్యాలయంలోని ఇన్వర్టర్ బ్యాటరీలు, కంప్యూటర్లు పని చేయకపోవడంతో నాలుగు రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్థానిక మెకానిక్‌లతో కంప్యూటర్లు, బ్యాటరీలకు మరమ్మతులు చేయించారు. గురువారం 25కు పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ అశోక్ తెలిపారు.

ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): జిల్లావ్యాప్తంగా ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం చిన్నయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఆదివాసీలకు వందశాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రతీ గ్రామంలో జెండా ఆవిష్కరించాలన్నారు. గోండ్వానా కోయ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్, జిల్లా కార్యదర్శి సిడాం అశోక్, మండల అధ్యక్షుడు మడావి మల్లేశ్, నాయకులు ఆత్రం సిద్దు, ఆలం బానయ్య, ఆత్రం రవికుమార్, పొర్తెటి భగవాన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'పోరాట ఫలితమే సుప్రీంకోర్టు తీర్పు'

ఆసిఫాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతోమంది త్యాగధనులు చేసిన అలుపెరగని పోరాట ఫలితమే సుప్రీంకోర్టు తీర్పు అని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రవి అన్నారు. ఎస్సీ సామాజిక వర్గంలో ఏబీసీడీ వర్గీకరణ న్యాయమైందని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌక్ వద్ద సంబురాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం తీర్పుతో ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, ధర్నాలు నిర్వహించి విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు. అమరులైన నాయకులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పరి నరేశ్, కొండం సంతోష్, జాను, భీమేశ్ పాల్గొన్నారు.

61 మంది బాలకార్మికుల గుర్తింపు


మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ -10 కార్యక్రమం ద్వారా 61 మంది బాలకార్మికులను గుర్తించామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో గురువారం ఆపరేషన్ ముస్కాన్-10 కార్యక్రమం వివరాలను వెల్లడించారు. తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులుగా పని చేస్తున్న, అక్రమ రవాణాకు గురవుతున్న చిన్నారులను గుర్తించి పునరావాసం కల్పించామన్నారు. జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా 61 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించామన్నారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో 36 మంది, కాగజ్‌నగర్ డివిజన్‌లో 25 మందిని కాపాడామన్నారు. బాలలకు విద్య నందించేలా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి మహేశ్, ఎస్పీ సీసీ రాణాప్రతాప్, డీసీఆర్‌డీ సీఐ రమేశ్, అడ్మిన్ ఆర్‌ఐ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

హడావుడి పనులు.. మళ్లీ గుంతలు



ఇది జిల్లా కేంద్రం సమీపంలోని బూరుగుడ ఫ్లైఓవర్‌పై జాతీయ రహదారి దుస్థితి. గురువారం ఉదయం కోల్డ్‌మిక్స్‌తో పలు గుంతలను పూడ్చారు. నాణ్యత లేకుండా హడావుడి పనులు చేపట్టడంతో సాయంత్రానికే ఇలా మళ్లీ గంతలు ఏర్పడ్డాయి. వేలాది వాహనాలు ప్రయాణించే జాతీయ రహదారి నిర్వహణ తీరుపై విమర్శలు వస్తున్నాయి.


జాతీయ రహదారిపై గుంతల్లో నిలిచిన నీరు

- కోల్డ్‌మిక్స్‌తో జాతీయ రహదారిపై గుంతలు పూడ్చివేత
- నాణ్యత లేక సాయంత్రానికి మళ్లీ ఏర్పడిన వైనం
- ఇదేంటని ప్రశ్నిస్తే ఎన్‌హెచ్ఏఐ అధికారి వితండ వాదన
- 'మనిషికి జబ్బు రాదా! రోడ్లు ఖరాబు కావా' అంటూ అసహనం

సాక్షి, ఆసిఫాబాద్: 'ఆద్మీ బీమార్ నై పడ్తా క్యా?'.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని రేపల్లేవాడ నుంచి చంద్రాపూర్ సరిహద్దు వరకు ఉన్న జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలపై సాక్షి దినపత్రికలో గురువారం 'గతుకుల హైవే' పేరిట ప్రచురించిన కథనంపై ఎన్‌హెచ్ఏఐ అధికారి స్పందించిన తీరు ఇది. 'మనిషికి జబ్బు రాదా! రోడ్లు ఖరాబు కాకుండా ఉంటాయా' అన్న ధోరణిలో ఆయన వితండ వాదన ఉంది. 'సాక్షి'లో వచ్చిన కథనంపై స్పందించిన ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది హడావుడిగా గురువారం కొన్నిచోట్ల గుంతలను కోల్డ్ మిక్స్‌తో పూడ్చి వేయగా.. సాయంత్రానికే మళ్లీ రహదారిపై గుంతలు యథావిధిగా ఏర్పడటం పనిపై వారికి ఉన్న శ్రద్ధ.. కోల్డ్‌మిక్స్‌లో ఉన్న నాణ్యతను తేటతెల్లం చేస్తోంది. అలాగే ద్విచక్ర వాహనాదారులు కొందరు బూరుగుడ వద్ద జాతీయ రహదారికి మధ్యలో ఉన్న డివైడర్‌ను రెండు చోట్ల పగులగొట్టి నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నా ఎన్‌హెచ్ఏఐ అధికారులు పట్టించుకోవడం లేదు. బూరుగుడ పెట్రోల్ పంపునకు ఎందురుగా డివైడర్‌ను పగులగొట్టి సుమారు ఏడు నెలలు కావొస్తున్నా నేటికీ చర్యలు లేకపోవడం గమనార్హం.

సెల్ఫ్ హీలింగ్‌తో పరిష్కారం..
జాతీయ రహదారులను నాణ్యతతో పటిష్టంగా నిర్మిస్తున్నా కొందరు కాంట్రాక్టర్లు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు కుమ్మక్కవడంతో పనుల నాణత్యను గాలికి వదిలేస్తున్నారు. నిర్మాణంలో నాసిరకమైన మట్టి, బేస్‌మెంట్ స్థాయిలో జరిగే పనులు సైతం పర్యవేక్షించకపోవడంతోనే ఇలాంటి దుస్థితి ఏర్పడుతుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. పనుల్లో ఎలాంటి లోపం లేకుంటే సాధారణంగా నాలుగైదేళ్ల వరకూ గుంతలు ఏర్పడే అవకాశం ఉండదని వారు పేర్కొంటున్నారు. సాధారణంగా రహదారులపై ఏదైనా గుంత ఏర్పడితే మళ్లీ దాన్ని మాన్యువల్‌గా పూడ్చాల్సిందే. ముఖ్యంగా వర్షాకాలంలో వస్తే ఈ గుంతల్లో నీరు నిలిచిపోయి రోడ్లు మరింత పాడవుతాయి. అలా కాకుండా చిన్నపాటి గుంత లేదా పగుళ్లు ఏర్పడగానే దానంతట అదే పూడకుపోయేందుకు రహదారుల నిర్మాణంలో సెల్ఫ్ హీలింగ్ మెటీరియల్‌ను వాడితే ఎంతో ఉపయోగమని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు.

ఏడాదికే అధ్వానం
రేపల్లేవాడ నుంచి చంద్రాపూర్ సరిహద్దు వరకు ఉన్న జాతీయ రహదారి- 363పై పలుచోట్ల గుంతలు పడి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. మరోవైపు ఎన్‌హెచ్ఏఐ అధికారులు, పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. రహదారి నిర్మాణ పనులు చేపట్టిన డీబీఎల్ సంస్థ తూతూమంత్రంగా.. నాణ్యతకు తిలోదకాలిచ్చి పనులు పూర్తి చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందువల్లే ఏడాది తిరగకుండానే జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడ్డాయని, వర్షం నీరు నిలుస్తుండటం గోతులకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. రేపల్లేవాడ నుంచి ప్రారంభమయ్యే ఈ జాతీయ రహదారిలో రెబ్బెన ఫ్లైఓవర్‌పై గుంతలు ఏర్పాడ్డాయి. అలాగే కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు ఫ్లైఓవర్‌తోపాటు బూరుగుడ ఫ్లైఓవర్, ఈదులవాడ సమీపంలోని రహదారిపై, వాంకిడి వద్ద, గోయిగాం వద్ద.. ఇలా పలుచోట్ల జాతీయ రహదారిపై గుంతలు వాహనదారులకు దర్శనమిస్తున్నాయి. వాహనం గుంతల్లో పడకుండా వెళ్లేందుకు నానా ఇక్కట్లు పడుతున్నారు. అంగుళం నుంచి అడుగు లోతు వరకు గుంతలు ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాహనాలు చెడిపోవడంతోపాటు అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బూరుగుడ సమీపంలో పగులగొట్టిన డివైడర్

'స్వచ్ఛదనం- పచ్చదనం' పకడ్బందీగా నిర్వహించాలి


వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ ఈ నెల 5న గ్రామాలు, మున్సిపాలిటీల్లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించాలని, 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7న మురుగు కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేసి గుంతలు పూడ్చడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధికుక్కల దాడుల నివారణ చర్యలు చేపట్టడం, 9న డ్రై డే, ప్రభుత్వ సంస్థల ను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్, గ్రామస్థాయిలో కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలను నియమించాలని, ప్రతీ గ్రామానికి మండలస్థాయి అధికారి, మున్సిపాలిటీలోని వార్డులకు గెజిటెడ్ అధికారులను ప్రత్యేకాధికారులను నియామించాలన్నారు. కలెక్టర్లు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. అలాగే వనమహోత్సవం కార్యక్రమం లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వెంకటేశ్ దోత్రే మాట్లాడారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. ప్రతిరోజూ ఇంటింటికీ తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో భిక్షపతి, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిరప సాగుకు మొగ్గు


కౌటాల మండలం వీర్దండిలో మిరప నారుమడులు

- ఆసక్తి చూపుతున్న జిల్లా రైతులు
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ఇప్పటికే నారు మడులు సిద్ధం
- మార్కెట్‌లో ధరపై ఆశలు

కౌటాల(సిర్పూర్): ఎర్ర బంగారంగా పిలిచే మిరప సాగుపై జిల్లా రైతులు మొగ్గు చూపుతున్నారు. స్థానిక వ్యాపారులు కొంతమంది విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తుండగా సుదూర ప్రాంతాలకు వెళ్లి మరీ విత్తనాలు తెచ్చుకుంటున్నారు. వరంగల్, ఖమ్మం, ఆసిఫాబాద్ పట్టణాల్లో మేలు రకం విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. పది గ్రాముల ప్యాకెట్ రూ.700 ఉండగా కిలో విత్తనాలు రూ.70 వేలకు అమ్ముతున్నారు. ఎకరం విస్తీర్ణంలో పంట సాగుకు 100 గ్రాముల నుంచి 120 గ్రాములు అవసరమవుతాయని రైతులు చెబుతున్నారు. జూలై మొదటి వారంలోనే విత్తనాలు సమకూర్చుకుని నారు పెంచుతున్నారు. ప్రస్తుతం మిరప మొక్కలు నాటాడానికి చేలు సిద్ధం చేస్తున్నారు.

కాగజ్‌నగర్ డివిజన్‌లోనే అధికం
ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని రైతులు అంతంత మాత్రంగానే మిరప సాగు చేస్తుండగా.. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో మాత్రం సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని మొత్తం 1500 మందికి పైగా రైతులు ఈ పంట సాగు చేస్తున్నారు. కౌటాల మండలం తాటిపల్లి, గుడ్లబోరి, మొగడ్‌దగడ్, కౌటాల, గురుడుపేట, వీర్దండి, గుండాయిపేట్, సిర్పూర్(టి) మండలం టోంకిని, వెంకట్రావ్‌పేట్, పారిగాం, లోనవెల్లి, చింతలమానెపల్లి మండలం లంబాడిహెట్టి, గంగాపూర్, రుద్రాపూర్, చింతలమానెపల్లి, కర్జెల్లి, బాబాపూర్, బెజ్జూర్ మండలం సోమిని, కుకుడ తదితర గ్రామాల్లో సాగు ఎక్కువగా ఉంది. జూన్, జూలై నెలల్లో మడులు సిద్ధం చేసి మిరప విత్తనాలు విత్తుకున్నారు. ప్రస్తుతం చీరలు కప్పి నారుకు రక్షణ కల్పిస్తున్నారు. ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్ వరకు నాట్లు పూర్తి చేసే అవకాశం ఉంది.

గత నష్టాలు పూడ్చుకునేలా..
గతేడాది జిల్లాలో రెండు వేల ఎకరాల వరకు మిరప సాగు చేయగా.. ఎండు మిరప ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈసారి సాగు విస్తీర్ణం అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్లో నాణ్యమైన మిర్చి క్వింటా రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. గతేడాది వర్షాభావ పరిస్థితులతో పంట తెగుళ్ల బారిన పడింది. పంట చేతికందే సమయంలో మార్కెట్‌లో ధర సైతం పడిపోయింది. రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. కొందరికి పెట్టుబడులు కూడా దక్కలేదు. ఆ లోటును ఈసారి భర్తీ చేసుకునేలా రైతులు ముందస్తు ప్రణాళికతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. అయితే ప్రాణహిత, పెన్‌గంగ నదుల పరీవాహక గ్రామాల్లో ఏటా మిరప సాగు పెరుగుతున్నా పంటను అమ్ముకునేందుకు మార్కెట్ సౌకర్యం లేదు. ఈ ఏడాదైనా జిల్లాలో మిర్చి మార్కెట్ సౌకర్యం కల్పించడంతోపాటు కోల్డ్‌స్టోర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఈసారి ఎనిమిదెకరాల్లో..



గతేడాది ఐదెకరాల్లో మిరప పంట సాగు చేసి 60 క్వింటాళ్ల దిగుబడి సాధించా. తెగుళ్లతో దిగుబడి తగ్గింది. క్వింటా రూ.15 వేల నుంచి రూ.18 వేల ధరకు విక్రయించాను. ఈ ఏడాది ఎనిమిదెకరాలను మిరప సాగు కోసం సిద్ధం చేశాను. – ఆత్రం చరణ్‌దాస్, వీర్దండి, మం.కౌటాల

మార్కెట్ లేక ఇబ్బంది



మిరప సాగుకు అధిక పెట్టుబడులైనా దూర ప్రాంతాలకు వెళ్లి విత్తనాలు తెస్తున్నాం. స్థానికంగా పంటను అమ్ముకునేందుకు మార్కెట్ లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. అలాగే ఎండుమిర్చి నిల్వకు సౌకర్యం కల్పించాలి.
– జాడే కాశీనాథ్, వీర్దండి, మం. కౌటాల

సలహాలు పాటించాలి



నకిలీ మిరప విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నాటుకునేందుకు సిద్ధంగా ఉండాలి. నారు ఏపుగా పెరిగిన అనంతరం నాటాలి. ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలి.
– శాంతిప్రియ, ఉద్యానవనశాఖ డివిజన్ అధికారి, కాగజ్‌నగర్

అతి వేగం.. ప్రాణాలు పణం

కౌటాల మండలం ముత్తంపేట సమీపంలోని శీర్షాక్రాస్ రోడ్ సమీపంలో జూలై 27న రాత్రి వేగంగా వచ్చిన ఓ కారు చెట్టును ఢీకొట్టగా.. ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా మారింది. ఘటనాస్థలిలోనే కారు నుజ్జునుజ్జయింది. కారు ప్రయాణించిన వేగం 180 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల మధ్య అంటే దాదాపు 190కి.మీ.లుగా చూపించింది. చెట్టును ఢీకొన్న వేగానికి కారు నుంచి ఇంజిన్ విడిపోయి రోడ్డుకు మరోవైపు సుమారు ఐదు మీటర్ల దూరంలో పడిపోయింది. ముందు టైర్ మరో పదిమీటర్ల దూరంలో ఉంది. ప్రమాదంలో చనిపోయిన యువకుడు అంజన్న తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమారుడు కావడంతో విషాదం నెలకొంది. ఇలా జిల్లాలోని పలు మార్గాలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి.


కౌటాల మండలం ముత్తంపేట వద్ద ప్రమాద దృశ్యం

- జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- బలవుతున్న యువకులు
- ప్రమాదకరంగా 'సిర్పూర్' అటవీ, గ్రామీణ రహదారులు
- నివారణ చర్యలు చేపట్టని అధికారులు

చింతలమానెపల్లి(సిర్పూర్): అతివేగం సరదాగా అనిపిస్తుంది. వాహనం నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన చోట అనర్థాలు కలిగిస్తుంది. తీవ్ర ప్రమాదాలకు కారణమవుతోంది. ప్రాణాలు కోల్పోయి కుటుంబాల్లో విషాదం నింపుతోంది. బంధుమిత్రులను కన్నీటిపాలు చేస్తోంది. జిల్లాలోని జాతీయ రహదారితోపాటు అంతర్రాష్ట్ర, గ్రామీణ రహదారుల్లోనూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతేడాది జిల్లావ్యాప్తంగా 120 రోడ్డు ప్రమాదాలు జరగగా.. ఈ ఏడాది ఇప్పటికే 50 ప్రమాదాలు నమోదయ్యాయి. అనధికారికంగా వీటి సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

నిబంధనల ఉల్లంఘనే కారణం
వాహనాలు నేడు విలాసాలకు మారుపేరుగా మారాయి. ఆధునికత, పరిజ్ఞానంతో వాహనాల్లో నూతన సౌకర్యాలు, వేగం అందుబాటులోకి వచ్చాయి. క్షణాల్లో 60 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకునే కార్లు, ద్విచక్రవాహనాలు యువకులను ఆకర్షిస్తున్నాయి. గ్రామీణ రహదారులపై సైతం అదే వేగంతో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. రహదారుల సామర్థ్యంతో సంబంధం లేకుండా మితిమీరిన వేగంతో వాహనాలు నడుతుపుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరగడానికి ప్రధానంగా మద్యం తాగి వాహనం నడపడం, అతివేగం, ఓవర్ లోడ్, రక్షణ చర్యలు పాటించకపోవడం. వాహనాల ఫిట్‌నెస్ నిర్వహించాలని, కారులో సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని అధికారులు సూచిస్తున్నారు. తరచూ తనిఖీలు కూడా నిర్వహిస్తున్నారు. కానీ నిబంధనలు ఉల్లంఘనలతో ప్రమాదాల తీవ్రత పెరుగుతుంది.


ముత్తంపేట ప్రమాదంలో 190 కిలోమీటర్ల వేగాన్ని చూపిస్తున్న మీటర్

అవగాహన కరువు
వాహనదారులు నిబంధనలు, అప్రమత్తత, రహదారుల సామర్థ్యం, రహదారుల భద్రత వంటి అంశాలపై అవగాహన కొరవడడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. నూతనంగా వాహనాలు కొనుగోలు చేసిన కుటుంబాలలో యువకులు వాహనాలను అతివేగంగా నడపడానికి ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ప్రమాదాల నియంత్రణకు పని చేయాల్సిన అధికారులు సైతం జరిమానాలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తరచూ ప్రమాదాలు జరిగే స్పాట్లను గుర్తించడం, సూచికలు ఏర్పాటు చేయడంతోపాటు నిబంధనలపైనా అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ దారులు డేంజర్..
సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల, సిర్పూర్, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల్లోని ఆయా రహదారులు ప్రమాదకరమైన మార్గాలు నిలుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కౌటాల మండలంలోని ముత్తంపేట నుంచి కౌటాల, తలోడి నుంచి చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్, ఖర్జెల్లి నుంచి గూడెం అటవీ మార్గం, డబ్బా నుంచి కడంబా అటవీ మార్గం, కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్ రహదారి, కాగజ్‌నగర్ నుంచి ఆసిఫాబాద్ రహదారి, పెంచికల్‌పేట్ రహదారి, దహెగాం మండల కేంద్రం నుంచి కాగజ్‌నగర్ మార్గం, పెంచికల్‌పేట్ నుంచి బెజ్జూర్ మండలం సలుగుపల్లి వరకు రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. కౌటాల మండల కేంద్రం నుంచి ముత్తంపేట వరకు శీర్షాక్రాస్‌రోడ్ సమీపంలో గడిచిన పదేళ్లలో సుమారు వందకు పైగా ప్రమాదాలు జరిగినట్లు అనధికార అంచనా. చింతలమానెపల్లి మండలం ఖర్జెల్లి నుంచి గూడెం వరకు ఉన్న రహదారిపై కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

క్రీడల్లో రాణించాలి

ఆసిఫాబాద్‌రూరల్: క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ అన్నారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా కేంద్రంలో గురువారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ హర్యానాలో జూలై 25 నుంచి 27 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా నుంచి కీర్తన, ప్రణీత్ పాల్గొనగా.. కాగజ్‌నగర్‌కు చెందిన ప్రణీత్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తిరుపతి, కోచ్‌లు హరీశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆసిఫాబాద్ మండలం పాడిబండ పంచాయతీ పరిధిలోని వట్టివాగు వద్ద ఏర్పాటు చేసిన సంపద వనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సంపద వనాల్లోని మొక్కలను సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో మొక్కల ఎదుగుదల ఉంటుందన్నారు. ఆయన వెంట ఏపీవో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అభ్యర్థులకు ఇబ్బందులు రానీయొద్దు
గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు రానీయొద్దని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని గురువారం పరిశీలించారు. ప్రహరీపాటు ఇతర పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచాలన్నారు. జేఈ శశిధర్, డీటీ పోచయ్య పాల్గొన్నారు.


మొక్కలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

క్లుప్తంగా

కలప పట్టివేత


పట్టుకున్న కలపతో బీట్ అధికారి, సభ్యులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ ఊట్ల బీట్ పరిధిలో బైక్లపై అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. రేంజ్ అధికారి సుష్మారావు కథనం ప్రకారం.. ఊట్ల బీట్ పరిధిలో పెట్రోలింగ్ చేస్తున్న డీఆర్వో పోచమల్లు, బీట్ అధికారి సాయికి బుధవారం రాత్రి కడెం ప్రధాన కాలువ సమీపంలో బైక్లు కనిపించాయి. అటు వైపు టార్చిలైట్ వేయగా, కలప దుంగలను పడేసి బైక్లపై పారిపోయారు. మూడు సైజులు, 8 వాసాలు మొత్తం 0.421 సీఎంటీ కలప పట్టుకున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు. వీటి విలువ రూ.33,844 ఉంటుందని పేర్కొన్నారు.

లారీడ్రైవర్‌కు ఐదేళ్ల జైలు

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన వీరభద్రరావు మృతి కారణమైన లారీడ్రైవర్‌కు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పునిచ్చారు. రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి ఓసీపీలో డ్రైవర్‌గా విధులు నిర్వహించే వీరభద్రరావు 2019, సెప్టెంబర్ 12న విధులు ముగించుకుని రెబ్బెన వస్తుండగా లారీ ఢీకొట్టింది. వీరభద్రరావు అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సమ్మక్క ఫిర్యాదుతో కేసు నమోదైంది. లారీడ్రైవర్ ఎండీ సలీంని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు. అలాగే లారీ యజమానికి రూ. వెయ్యి జరిమానా విధించారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన ప్రస్తుత డీఎస్పీ సదయ్య, రెబ్బెన సీఐ, ఎస్సై, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని వాడిగుడ రహదారిపై గురువారం బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. మాలన్‌గొందికి చెందిన మడావి రవి తలకు, చెవికి గాయమైంది. పలువురు గమనించి అతన్ని ఆటోలో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి రెఫర్ చేశారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీ, రాజీవ్‌గాంధీ చౌరస్తా, ఓల్డ్ కాలనీల్లో గురువారం పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో వారు చికిత్స పొందారు.

వామ్మో రక్తపింజరలు

- బెల్లంపల్లిలో సంచారం
- భయాందోళనలో ప్రజలు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో విషసర్పాల సంచారం విపరీతంగా పెరిగింది. నాగుపాము, కొండ చిలువలతోపాటు ప్రమాదకరమైన రక్తపింజర పాములు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఏటా ఒకటి, రెండు మాత్రమే దర్శనమిచ్చే ఇవి ప్రస్తుతం వందల సంఖ్యకు చేరుకున్నట్లుగా తెలుస్తోంది. కెమికల్ ఏరియా, కాల్‌టెక్స్, రాంనగర్, కుంట రాములు బస్తీ తదితర ప్రాంతాల్లో వీటి బెడద ఉంది. దీంతో పురప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. నాగుపాము, కొండ చిలువలు ఇళ్ల పరిసరాల్లో ఇబ్బడి ముబ్బడిగా సంచరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ ప్రాంతాలను మించి బెల్లంపల్లిలో లెక్కకు లేనన్నీ విషసర్పాలు సంచరిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

పాముల సంచారం

వర్షాకాలం కావడంతో ఇళ్ల పరిసరాలు, రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పాములకు నిలయంగా మారాయి. శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న ఇళ్లు, భవనాల్లో పాములు ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. చెట్లు, పుట్టల్లో నుంచి పాములు, తేళ్లు బయటకు వచ్చి ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. శాంతిఖని బస్తీ, 65 డీప్ ఏరియా, సుభాష్‌నగర్, నెంబర్–2 ఇంక్‌లైన్ బస్తీ, రైల్వే రడగంబాల బస్తీ, రైల్వేస్టేషన్ ఏరియా, సుబ్బారావుపల్లి, పెద్దనపల్లి, హౌజింగ్ బోర్డు కాలనీ, కాల్‌టెక్స్, గంగారాంనగర్, గాంధీనగర్, కన్నాల బస్తీ, మధునన్ననగర్, టేకులబస్తీ, కొత్తబస్టాండ్ ఏరియా ఇందిరమ్మకాలనీ, కాంట్రాక్టర్ బస్తీ, షంషీర్‌నగర్, అంబేద్కర్‌నగర్, రవీందర్‌నగర్, బెల్లంపల్లి బస్తీ, గోల్ బంగ్లా, బాబుక్యాంపు బస్తీ, అశోక్‌నగర్, భూడిదగడ్డ బస్తీ, రాంనగర్ తదితర ప్రాంతాల్లో పాముల సంచారం అధికంగా ఉంది. దీంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు భయపడుతూ రోజువారీగా అప్రమత్తంగా ఉంటున్నారు. మున్సిపాలిటీలో ఇప్పటివరకు ఏ ఒక్కరు కూడా పాముకాటుకు గురికాకుండా స్వీయ నియంత్రణ చర్యలు తీసుకోవడం గమనార్హం.


ఓ వీధిలో రోడ్డుపైకి వచ్చిన రక్తపింజర పాము

పట్టించుకోని అధికారులు

శివారు బస్తీలను ఆనుకుని అటవీ ప్రాంతం ఉండటంతో ఆ వైపు నుంచి విషసర్పాలు వస్తున్నాయి. వర్షాకాలంలో సర్పాల నుంచి ప్రజలను రక్షించడానికి చర్యలు తీసుకోవల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లిప్తతను వీడి చర్యలు చేపట్టాలని పుర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పాముల బెడద ఉంది



వర్షాకాలంలో పాముల బెడద తీవ్రంగా ఉంది. వీటి నుంచి ప్రాణాలను కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఏటా పాముల బెడద ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైన శ్రద్ధపెట్టి పాముల నుంచి ప్రజలను కాపాడాలి.

– కె.ప్రకాశ్, పురవాసి

సంతతి పెరిగింది



ఐదేళ్లపైబడి నుంచి బెల్లంపల్లి చుట్టుపక్క ప్రాంతాల్లో పాములు పడుతున్నాను. వాటిని సురక్షితంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలి వేస్తున్నాను. గతంలో ఎన్నడూ లేనంతగా రక్తపింజర పాములు సంచారం చేస్తున్నాయి. రెండు నెలల్లో 300కు పైగా రకరకాల పాములు పట్టుకోగా వీటిలో 100 వరకు రక్తపింజరలను పట్టుకున్నాను. ఈ పాముల సంతతి బెల్లంపల్లిలో క్రమంగా వృద్ధి చెందుతున్నట్లుగా కనిపిస్తోంది.

– దుర్గ రాజేశ్, పాములు పట్టే వ్యక్తి

భర్త గొంతు నులిమి హత్యచేసిన భార్య అరెస్టు

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ రాంబాబు

దహెగాం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను గొంతునులిమి హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన సుజాతకు దహెగాంకు చెందిన బండ మల్లేశ్‌తో గత 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు కుమార్తె ఉంది. వీరిది వ్యవసాయ కుటుంబం. మల్లేశ్ ఇంటి పక్కన ఉన్న గుర్లె రాజు వ్యవసాయం చేస్తుంటాడు. వ్యవసాయ కూలీ పనికి సుజాత వెళ్తుండేది. ఈ క్రమంలో రాజుతో ఆరేళ్ల క్రితం వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరి విషయం గతేడాది భర్తకు తెలిసింది. మద్యానికి అలవాటుపడి భార్యతో జరిగిన గొడవలో మల్లేశ్‌కు గాయపడ్డాడు. నాలుగు నెలలుగా విడిపోయి ఉన్నారు. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఏకం చేశారు. అయినా సుజాతలో మార్పు రాలేదు. రాజుతో వివాహేతర సంబంధం కొనసాగించింది. ఈ విషయమై గతనెల 25న భార్యభర్తలు గొడవపడ్డారు. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని ఎలాగైనా తొలగించుకోవాలని రాజు ప్రోత్సాహంతో గొంతు నులిమింది. తర్వాత కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి ఇంటికి తీసుకవచ్చారు. మాట రాకపోవడంతో గతనెల 28న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి అన్నయ్య బండ సత్తయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు. సుజాత, గుర్లె రాజుని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న కాగజ్‌నగర్ రూరల్ సీఐ

టేకుచెట్ల నరికివేత


స్మగ్లర్లు వదిలేసివెళ్లిన టేకు దుంగ

భీమారం: మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని భీమారం, ఎలకేశ్వరం బీట్లలో స్మగ్లర్లు గొడ్డళ్లతో టేకు చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలో అధికంగా టేకు ప్లాంటేషన్లు ఉన్న ఈ రెండు బీట్లలో నాలుగురోజుల క్రితం దాదాపు 10 చెట్లని తొలగించారు. ఫర్నిచర్‌కు అవసరమైన కర్రని తీసుకుని తరలించారు. అధికారుల రాకను గమనించి అవసరం లేని మిగతా చెట్టు బాగాలను అక్కడే వదిలి వెళ్లారు. గతంలో టేకు వనాల రక్షణకు ఏర్పాటు చేసిన బేస్ క్యాంపులు తొలగింపుతో పర్యవేక్షణ కరువైంది. కాగా, భీమారం, ఎలకేశ్వరంతోపాటు దాంపూర్ సెక్షన్‌లో టేకు చెట్ల నరికివేత కొనసాగుతోంది. ఉన్నతాధికారులు వెంటనే పట్టించుకుని టేకు ప్లాంటేషన్లని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 91 శాతం బొగ్గు ఉత్పత్తి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా గత జులైలో 91 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా జీఎం రవిప్రసాద్ తెలిపారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. గత నెలలో ఏరియాకు 2.40లక్షల టన్నులకు గాను 2.18 టన్నులతో 91 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. కైరిగూడ ఓసీపీలో 2.4లక్షల టన్నులకు గాను 2.18 లక్షల టన్నులు సాధించామని అన్నారు. 23 రోజులుగా ఏరియాలో వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడిందన్నారు. ఓబీ వెలికితీత పనులకు అంతరాయం కలిగిందన్నారు. అయినా బొగ్గు ఉత్పత్తికి ప్రక్రియ నిరాటంకంగా సాగించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్వారీలో మోటార్లు ఏర్పాటు చేసి వర్షపు నీటిని తోడి బయటకు పంపిస్తున్నామని అన్నారు. సమావేశంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏరియా జీఎం రవిప్రసాద్

పవర్ ప్లాంటు కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

జైపూర్: పవర్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని హెచ్ఎంఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత రెండేళ్లుగా హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌తో చర్చలు నడుస్తున్నాయన్నారు. డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డైరెక్టర్‌తో మీటింగ్ ఏర్పాటు చేయమని ఆదేశాలు జారీ చేసినా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికి యూనియన్లతో మీటింగ్ ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే మీటింగ్ ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్టీపీసీలో మాదిరిగా ఇక్కడి కార్మికులకు అలవెన్సులు అమలు, పనికి తగిన వేతనాలు చెల్లించాలన్నారు. హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులతో జీఎం శ్రీనివాసులు సాయంత్రం సమావేశం నిర్వహించి కార్మిక సమస్యలపై చర్చించారు. నాయకులు జక్కుల నారాయణ, హెచ్ఎంఎస్ ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, సెక్రెటరీ సాయికృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సంపత్, ట్రెజరీ సత్యనారాయణచారి, జాయింట్ సెక్రెటరీ అజాద్, మల్లికా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఇన్‌స్పైర్ జాతీయ స్థాయిలో విజేతగా నిలిచి జపాన్, ఇంటర్నేషనల్ సైన్స్ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కేజీబీవీ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి విద్యాసింగ్‌ను గురువారం కలెక్టర్ చాంబర్‌లో డీఈవో ఎస్.యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి సన్మానించారు. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం జీవితచరిత్ర 'వింగ్స్ ఆఫ్ ఫైర్' పుస్తకాన్ని అందజేసి భవిష్యత్‌లో రాణించాలని తెలిపారు. కస్తూరిబా బాలికల పాఠశాల ప్రత్యేక అధికారి స్వప్న, ఉపాధ్యాయులు మమత పాల్గొన్నారు.

క్రికెట్‌లో క్రీడాకారులు రాణించాలి


క్రికెట్ ఆడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: క్రికెట్ పోటీల్లో గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాణించాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లిలోని ఏఎంసీ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అండర్–19, అండర్–23 విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఏసీపీ రవికుమార్ పోటీలను ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, బండి ప్రభాకర్, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, కోచ్ శేఖర్, గౌతమ్, పీఈటీలు ఇమ్మానియేల్, అజీజుద్దీన్, శ్రీకాంత్, గోకుల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేవైఎం నాయకులపై కేసు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో అనుమతి లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన 25 మంది బీఆర్ఎస్ నాయకులు, 8 మంది బీజేవైఎం నాయకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టం ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు చేపట్టవద్దని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భార్యతో గొడవపడి.. నగదు, బంగారంతో పరారీ


వెంకటేశ్(ఫైల్)

వాంకిడి: మద్యానికి బానిసై ఓ వ్యక్తి భార్యతో గొడవపడి ఇంట్లో నగదు, బంగారు నగలు తీసుకుని పరారయ్యాడు. మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. ఖిరిడి గ్రామానికి చెందిన వడై వెంకటేశ్ మద్యానికి బానిసై భార్య ఇందిరాబాయితో గొడవ పడేవాడు. ఈక్రమంలో జూలై 30న మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. ఉదయాన్నే మద్యం తాగడం ఏంటని, చేనుల్లో పని చేసుకుంటే ఏమవుతుందని భార్య మందలించింది. ఈ క్రమంలో భార్యను వెంకటేశ్ బూతులు తిడుతూ కొట్టడానికి వచ్చాడు. ఇద్దరు కుమారులు జోక్యంతో గొడవ సర్దుమణిగింది. అదే రోజు కుమారులను తీసుకుని ఇందిరాబాయి చేన్లో పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకుంది. బీరువా పగలగొట్టి అందులో రూ.8 వేల నగదు, రెండు తులాల బంగారం కనిపించలేదు. భర్త ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. ఇందిరాబాయి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొరవడిన పర్యవేక్షణ

- ఇష్టారాజ్యంగా వంతెన నిర్మాణం
- నాణ్యతలేమితో పనులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుగ్గగట్టు నుంచి నర్సింగాపూర్ వెళ్లేదారిలో ఇటీవల వంతెన నిర్మాణం చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నాడు. అతితక్కువ ఎంఎం స్టీల్ వాడుతూ వంతెన పిల్లర్ల పనులు చేపడుతుండగా ఎలాంటి నాణ్యత లేకుండా నాసిరకం పనులు సాగుతున్నాయి. గతేడాది వరదల సమయంలో ఎఫ్‌డీఆర్ కింద రూ.60 లక్షలు వంతెన నిర్మాణ కోసం కేటాయించారు. మంచిర్యాలకు చెందిన ఓ కాంట్రాక్టర్ చేపట్టాల్సిన పనులు దాదాపు 10 నెలల ఆలస్యంతో హాజీపూర్ మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చారు. ప్రస్తుతం పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. పంచాయతీ రాజ్ జేఈ సుబ్బారెడ్డి పర్యవేక్షణ లేకపోవడంతో సబ్ కాంట్రాక్టర్‌కు వరంగా మారింది. దీంతో పనుల నాణ్యతకు తిలోదకాలు పలికి లాభాపేక్షతో పనులు చేపడుతున్నారు.

రైతుల అవస్థలు

నర్సింగాపూర్, నంనూర్ గ్రామాల శివారులోని రైతులు తమ వ్యవసాయ పనులకు వెళ్లేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. వంతెన పనులు చేపట్టే సదరు కాంట్రాక్టర్ ప్రత్యామ్నాయంగా తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయలేదు. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షాకాలం కావడంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో రైతులు అదనంగా మరో 10 కి.మీ మేరకు ప్రయాణం సాగించి వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. తాజాగా గురువారం ఓ రైతు ఎడ్లబండిపై వంతెన పక్కన నీటి నుంచి వెళ్తుండగా గుంతల్లో దిగబడింది. స్థానికులు గమనించి అతనితో పాటు ఎడ్లను రక్షించి బయటకు తీసుకువచ్చారు. అప్పుడే వచ్చిన కాంట్రాక్టర్ ఇదంతా చూసి కూడా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో స్థానికులు విస్తుపోయారు.


నర్సింగాపూర్‌లో నాసిరకంతో వంతెన పనులు

రహదారి ఏర్పాటుకు చర్యలు

కల్వర్టు నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌ను మందలిస్తాం. రెండు రోజుల్లో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేలా రహదారి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– హరీశ్, డీఈ, పంచాయతీ రాజ్

ఏరియా ఆసుపత్రి కోసం నిరాహార దీక్ష


ఏరియా ఆసుపత్రి ఎదుట దీక్షలో నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఎదుట గురువారం ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ నాయకులు మాట్లాడుతూ సింగరేణి ఏరియా ఆసుపత్రిని నిర్వీర్యం చేసి ఎత్తివేతకు గుట్టుగా యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వార్డులు కుదించి వైద్యులు, సిబ్బంది పోస్టులను ఉద్దేశపూర్వకంగా భర్తీ చేయడం లేదని పేర్కొన్నారు. ఆసుపత్రిని అభివృద్ధి చేసి యథావిధిగా కొనసాగించి, వైద్యసేవలను మెరుగుపర్చాలని, అప్పటివరకు పోరాట కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షలో కమిటీసభ్యులు డి.ఆర్.శ్రీధర్, మణిరాంసింగ్, కృష్ణ, కె.శంకరయ్య, జి.వెంకటయ్య, దేవదాస్, రమణ, రాంచందర్, ఎండీ.గౌస్, వినయ్‌కుమార్, ఖాదర్, చాంద్‌పాషా, నారాయణ, గోపాల్, లక్ష్మీనారాయణ, ఎస్.శంకర్, వెంకటేష్, తిరుపతి, రాజం, జి.శంకర్ తదితరులు కూర్చున్నారు. దీక్షకు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు మత్తమారి సూరిబాబు, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, ఎస్.రాజమొగిలి, పేరం శ్రీనివాస్, గెల్లి జయరాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుధ్య పనులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని 6, 9వ వార్డుల్లో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా వార్డుల్లో డెంగీ జ్వరాలు వస్తున్నట్లు కౌన్సిలర్ రాములునాయక్ కలెక్టర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ బెల్లంపల్లిలో ఉన్న డిప్యూటీ డీఎంహెచ్‌వోకు సమాచారం చేరవేశారు. దీంతో వైద్యసిబ్బంది జ్వర పీడితులకు వైద్యపరీక్షలు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు శానిటేషన్ సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించారు. జేసీబీతో మురికి నీటి కాలువల్లో పూడిక తీయించి మురికినీరు నిలువకుండా చేశారు. ఇళ్లు, పరిసరాల్లో, మురికినీటి గుంతల్లో స్ప్రేయింగ్ చేయించారు. కౌన్సిలర్ రాములునాయక్ మాట్లాడుతూ ఆయా వార్డుల్లో డెంగీ జ్వరాలు ప్రబలుతుండడంతో వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చేసి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. డెంగీ బాధితులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, డాక్టర్ సౌజన్య, టీఎంటీ దుర్గయ్య, ఏఎన్ఎం స్రవంతి, వైద్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్ప్రేయింగ్ చేయిస్తున్న కమిషనర్

పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించాలి

మంచిర్యాలటౌన్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించాలని, బిడ్డకు తల్లిపాలు అమృతం వంటివని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను బిడ్డకు పట్టించి, ఆరు నెలల వరకు తల్లిపాలను మాత్రమే తాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఏ.విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు సులోచనదేవి, జ్యోతి, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ బి.రజిత, ప్రాజెక్టు అసిస్టెంట్ టి.శ్యామల, బ్లాక్ కోఆర్డినేటర్ కే.సతీశ్, అంగన్‌వాడీ టీచర్లు వనిత, కాంతకృష్ణ, రేణుక, శ్రీలక్ష్మీ, నసీమ, రాంనగర్ సెక్టార్ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


తల్లులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న అనిత

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం


అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నస్పూర్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట చంద్రశేఖర్ తెలిపారు. గురువారం సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ సీసీసీ టౌన్‌షిప్‌లో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందని అన్నారు. ఈ విజయాన్ని ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన అమరులకు అంకితం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు కోంద్ర లింగయ్య, కొప్పర్తి రాజం, నాయకులు ఇరికిల్ల పురుషోత్తం, చంద్రయ్య, కదారి రమేశ్, ఉదయ్, అట్కపురం సమ్మయ్య పాల్గొన్నారు.

సింగరేణి బొగ్గుబ్లాకులు సంస్థకే దక్కేలా కృషి

కాసిపేట: సింగరేణి బొగ్గు బ్లాకులు సంస్థకే దక్కేలా ఐఎన్టీయూసీ కృషి చేస్తోందని కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఐఎన్టీయూసీ బాయిబాటలో భాగంగా గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేయం అంటూనే బీజేపీ నేతలు బ్లాకులు వేలానికి పెట్టడం దారుణమన్నారు. కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరి రాంశెట్టి నరేందర్, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మిట్ట సూర్యనారాయణ, ఏరియా కార్యదర్శి దొరిశెట్టి చెందశేఖర్, రాపర్తి శ్రీనివాస్, శంకర్‌రావు, బన్న లక్ష్మణ్‌దాస్, ఈదునూరి బాపు తదితరులు పాల్గొన్నారు.